సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 15 । మార్చి । 2023



బ్యాటరీల చోరీ ముఠా అరెస్ట్

జిల్లాలో సెల్‌ఫోన్ టవర్ల వద్ద బ్యాటరీలు చోరీ చేస్తున్న ముఠాను మంగళవారం అరెస్ట్ చేసినట్లు కావలి డీఎస్పీ ఎం.వెంకటరమణ తెలిపారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.59,440
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,307
3శాతం జీఎస్టీతో	రూ.5,466
నవర (8గ్రా)	రూ.43,728

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.3 /23.3

మంగళవారం గాలిలో తేమ 56 శాతం ఉంది. జిల్లావ్యాప్తంగా రోజంతా ఎండ తీవ్రత అధికంగా ఉంది. బుధవారం ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యం



ఏసీఎస్ఆర్ కాలనీ పాఠశాల విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు మింగిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ఆరోగ్య సిబ్బంది పనిచేస్తున్నారని, అందులో భాగంగా నులిపురుగుల నివారణతో చిన్నారుల్లో అనారోగ్య లక్షణాలు తొలగించేందుకు మాత్రలు అందజేస్తున్నట్లు అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకట ప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఏసీఎస్ఆర్‌కాలనీ ఎంపీపీ పాఠశాలలో పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అర్బన్ వైద్య కేంద్రం డాక్టర్ ఎస్‌కే అస్మాతో కలిసి ఆయన చిన్నారులకు ఆల్‌బెండజోల్ మాత్రలను మింగించారు. ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది బాధ్యతగా ఐదు రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఎంపీహెచ్ఈఓ సుధాకర్, ఏఎన్ఎంలు ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థి వసంతకుమార్‌రెడ్డిని అభినందిస్తున్న గురుకుల పాఠశాల సిబ్బంది

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం ఏపీ బాలుర గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి పాల వసంతకుమార్ రెడ్డి జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 8న నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని క్రీడా ప్రతిభను కనబరిచాడు. ఈ నెల 28 నుండి 30వ తేదీ వరకు ఛత్తీస్‌ఘడ్‌లోని బిలాయ్‌లో జరిగే జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ప్రతిభ కనబరచిన వసంతకుమార్‌రెడ్డిని పాఠశాల ప్రిన్సిపాల్ గల్లా మురళీకృష్ణ, త్రోబాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.రాజమోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కల్లూరి స్రవంతి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

సోమశిలలో 57.281 టీఎంసీలు



సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 57.281 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్‌డెల్టాకు 2100, ఉత్తరకాలువకు 530, దక్షిణకాలువకు 400, కండలేరుకు 100 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. సగటున 316 క్యూసెక్కులు ఆవిరవుతోంది.

శనగ పంటకు మద్దతు ధర

నెల్లూరు (అర్బన్): జిల్లాలో రబీ సీజన్‌లో పండించిన శనగ పంటకు క్వింటాలుకు రూ.5,335 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా కేంద్రం ద్వారా మార్క్‌ఫెడ్/నాఫెడ్ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో శనగలను మద్దతు ధరకు అమ్ముకోదలచిన రైతులు ముందుగా గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఈ క్రాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ ఈనెల 20వ తేదీ వరకు జరుగుతుందన్నారు.

లక్ష్యం దిశగా అడుగులు

1.15 కోట్ల ఉపాధి పనిదినాల లక్ష్యం

- ఇప్పటి వరకు కల్పించిన పనిదినాలు 1.01 కోట్లు
- కూలీలకు చెల్లించిన నగదు రూ.208 కోట్లు
- నిత్యం 50 నుంచి 60 వేల మంది పనులకు హాజరు



మనుబోలు మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

నెల్లూరు(పొగతోట): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జిల్లాలో వేగంగా జరుగుతున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 1.15 కోట్ల పనిదినాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఇప్పటి వరకు 1,01,36,699 పనిదినాలు కల్పించారు. ఈ వారానికి సంబంధించి 3.50 లక్షల పనిదినాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయవలసి ఉంది. ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో జిల్లాకు 85 లక్షల పనిదినాలు లక్ష్యంగా నిర్దేశించారు. లక్ష్యం పూర్తి కావడంతో అదనంగా 30 లక్షల పని దినాలు పెంచారు. ఉపాధి పనులకు హాజరైన కూలీలకు ఇప్పటి వరకు పేమెంట్ల ద్వారా సుమారు రూ.208 కోట్లు చెల్లించారు. కూలీలు చేసిన పనులకు సంబంధించిన పేమెంట్లు వారి వారి బ్యాంకు అకౌంట్లకు నేరుగా జమ అవుతున్నాయి. ఈ నెల 31వ తేదీలోపు మిగిలిన పని దినాలు కల్పించేలా డ్వామా అధికారులు చర్యలు చేపట్టారు. ఉపాధి పనుల పర్యవేక్షణకు క్లస్టర్ ఏపీడీలు, ప్రతి మండలంలో ఏపీఓ, ఈసీ, టీఏలు, బీఎఫ్‌టీలు, ఎఫ్ఏలు అందుబాటులో ఉన్నారు. కూలీలు చేసిన పనులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడానికి ప్రతి మండలంలోను కంప్యూటర్ ఆపరేటర్లు అందుబాటులో ఉన్నారు. జిల్లాలో 37 మండలాలలో 4.10 లక్షల జాబ్‌కార్డులు కలిగిన కూలీలు ఉన్నారు. జిల్లాలో రాపూరు, కలువాయి, సైదాపురం, ఉదయగిరి, మర్రిపాడు, వరికుంటపాడు, వింజమూరు, ఎస్ఆర్‌పురం, జలదంకి, బోగోలు, గుడ్లూరు, ఉలవపాడు తదితర మండలాల్లో ఉపాధి పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రతి రోజూ 60 వేల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు తక్కువగా ఉండడంతో ఉపాధి పనులకు కూలీలు అధికంగా హాజరువుతున్నారు.

వ్యవసాయ రంగం అభివృద్ధి చెందేలా..

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందేలా ఉపాధి పనులు చేపడుతున్నారు. ప్రతి వారం పనులకు డిమాండ్ పెడుతున్నారు. డిమాండ్ పెట్టే సమయంలో వ్యవసాయ రంగానికి సంబంధించి పంట కాలువలు, చెరువులు, చెక్‌డ్యామ్‌లు తదితర పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలకు పనులు అందుబాటులో ఉన్నాయి. వ్యవసాయ పనులు లేని ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించేలా డ్వామా అధికారులు చర్యలు చేపట్టారు. యంత్రాలతో కాకుండా కూలీల చేత పనులు చేపడుతున్నారు. ఉపాధి పనుల వలన గ్రామీణ ప్రాంతాల్లో పనుల కోసం వెళ్లే వలసలు చాలా వరకు తగ్గిపోయాయి.

సంవత్సరం	కల్పించిన పనిదినాలు
2019-20	79 లక్షలు
2020-21	1.10 కోట్లు
2021-22	1.29 కోట్లు
2022-23 (లక్ష్యం 1.15 కోట్లు)	1.01 కోట్లు

జిల్లాకు అవార్డులు

ఉపాధి హామీ పనుల అమలులో జిల్లాకు ఇప్పటి వరకు నాలుగు పర్యాయాలు జాతీయ అవార్డులు లభించాయి. కూలీలకు అధికంగా పనిదినాలు కల్పించడం, అధిక కుటుంబాలకు వంద రోజుల పనులు కల్పించడం తదితర అంశాల్లో జిల్లాకు జాతీయ స్థాయిలో నాలుగు పర్యాయాలు అవార్డులు లభించాయి. అప్పటి కలెక్టర్లు, డ్వామా అధికారులు ఢిల్లీలో జాతీయ అవార్డులను అందుకున్నారు.

అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు పనులు కల్పించడం, ఆయా ప్రాంతాల అభివృద్ధి కోసం ఉపాధి హామీ పథకం అమలు చేస్తున్నారు. పథకాన్ని దుర్వినియోగం చేసే వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. చేయని పనులు చేసినట్లు నమోదు చేయడం, బిల్లులు చేసిన పనులకు మరలా బిల్లులు చెల్లించడం, కూలీలలో చేయాల్సిన పనులు యంత్రాలతో చేయడం తదితర అక్రమాలకు పాల్పడే వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి సంవత్సరం చేపట్టిన ఉపాధి పనులను ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాయి. పనుల జరిగిన తీరు తదితర అంశాలను పరిశీలించి సోషల్ ఆడిట్ నిర్వహించి రికవరీలు చేస్తున్నారు. అక్రమాలకు పాల్పడిన సిబ్బందిని సస్పెండ్ చేస్తున్నారు.

పనులు కల్పిస్తున్నారు



పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస పోవాల్సిన అవసరం లేకుండా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తున్నారు. ఉదయం పూట ఉపాధి పనులకు హాజరవుతున్నాం. అనంతరం సొంత పనులు ఉంటే వెళతాం లేకుంటే వ్యవసాయ పనులకు హాజరవుతున్నాం.

ఎం.శాంతమ్మ, రావులకొల్లు

పేమెంట్లు జమ అవుతున్నాయి



ప్రతి రోజు ఉపాధి పనులకు హాజరవుతున్నాం. వారం వారం చేసిన పనులకు సంబంధించి పేమెంట్లు బ్యాంకు అకౌంట్లకు జమ అవుతున్నాయి. గతంలో రచ్చబండ వద్ద నగదు పంపిణీ చేసే వారు. దాని వలన ఇబ్బందులు పడే వాళ్లం. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదు. చేసిన పనులకు సంబంధించిన సొమ్ములు బ్యాంకు అకౌంట్‌కు జమ అవుతున్నాయి.

మన్నెం రాజయ్య, డీసీ పల్లి

వ్యవసాయం అభివృద్ధి చెందేలా..



ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవ సాయ రంగం అభివృద్ధి చెందే లా పనులు చేస్తున్నాం. నిత్యం పనులకు హాజరవు తున్నాం. వారం వారం డిమాండ్ పెట్టి ఉపాధి పను లు కల్పిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు లభిస్తున్నాయి.

డి.శ్రీనివాసులు, గండ్లవీడు, ఆత్మకూరు

నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేస్తాం



జిల్లాలో జాబ్‌కార్డులు కలిగిన వ్యవసాయ కూలీలందరికీ పనులు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఈ ఆర్థిక సంవత్సరంలో 1.15 కోట్ల పనిదినాలు కల్పించాలనే లక్ష్యం ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పటి వరకు 1.01 కోట్ల పని దినాలు కల్పించాం. నిర్దేశించిన లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేసేలా చర్యలు చేపట్టాం. గ్రామీణ ప్రాంతాల్లో అడిగిన వారందరికీ పనులు కల్పించేలా చర్యలు తీసుకున్నాం.

–వెంకటరావు, డ్వామా పీడీ

రూ.కోటితో మినీ క్రీడా ప్రాంగణం

- అనంతసాగరంలో స్థల పరిశీలన చేసిన క్రీడాశాఖ అధికారులు



మినీ స్టేడియంకు స్థల పరిశీలన చేస్తున్న నాయకులు, అధికారులు

సోమశిల: అనంతసాగరంలో రూ.కోటితో క్రీడాకారులకు ఎంతో సౌలభ్యంగా ఉండేలా రాష్ట్ర క్రీడాభివృద్ధి శాఖ మినీ స్టేడియంను మంజూరు చేసింది. ఈ మేరకు మంగళవారం జిల్లా చీఫ్ ఆర్‌కె యతిరాజు, క్రీడాభివృద్ధి శాఖ సీఈఓ పుల్లయ్యలతో కలసి అనంతసాగరం జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి, రాష్ట్ర క్రీడాభివృద్ధి శాఖ డైరెక్టర్ కాలువ నరసింహాలు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా యతిరాజు మాట్లాడుతూ అనంతసాగరానికి రూ.కోటితో మినీ స్టేడియం మంజూరైందని అన్నారు. ఇందుకు సంబంధించి స్థల పరిశీలన చేస్తున్నామని అన్నారు. సుమారు 6.15 ఎకరాల్లో స్టేడియం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలో మినీ స్టేడియం ఏర్పాటు ద్వారా భవిష్యత్తులో మరింత మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు లభించనుందని పేర్కొన్నారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ బొర్రా శోభ, తహసీల్దారు వెంకట రమణరావు ఉన్నారు.

నేటి నుంచి చేనేత వస్త్ర ప్రదర్శన

నెల్లూరు(మినీబైపాస్): జాతీయ చేనేత అభివృద్ధి పథకంలో భాగంగా నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ అకాడమీలో బుధవారం నుంచి 28వ తేదీ వరకు చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి ఏ ఆనంద్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు స్టాల్స్ తెరిచి ఉంటాయని చెప్పారు.

నిఘా కెమెరాల పర్యవేక్షణలో..

- నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు
- నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదు
- హాజరు కానున్న 55,909 మంది విద్యార్థులు
- ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు



మాట్లాడుతున్న ఆర్ఐఓ వరప్రసాదరావు

నెల్లూరు (అర్బన్): కరోనా తర్వాత పూర్తిస్థాయిలో తొలిసారిగా జిల్లాలో ప్రథమ, ద్వితీయ సంవత్సర ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు సీసీ కెమెరాల నిఘా నీడలో జరగనున్నాయి. ఈ పరీక్షలు బుధవారం నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగుతాయి. ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లు, ఇతర మెటీరియల్ అన్నింటిని ఇప్పటికే పోలీసు బందోబస్తు నడుమ స్ట్రాంగ్ రూమ్‌లకు అధికారులు పంపించారు. జిల్లాలో ఇందు కోసం 95 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 15న జూనియర్ ఇంటర్ పరీక్షలు, 16న సీనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయి. మొదటి సంవత్సరానికి సంబంధించి 14,211 మంది బాలురు, 13,394 మంది బాలికలు కలిపి 27,605 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 14,541 మంది బాలురు, 13,763 మంది బాలికలు కలిపి మొత్తం 28,304 మంది పరీక్షలు రాయబోతున్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సవాల విద్యార్థులు కలుపుకుని 55,909 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. అర్ధగంట ముందు పరీక్షా కేంద్రంలోనికి విద్యార్థులను అనుమతిస్తారు. 9 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోనికి విద్యార్థులను అనుమతించబోమని ఇంటర్మీడియట్ విద్యాశాఖ ప్రకటించింది. పరీక్షలకు 1,597 మంది ఇన్విజిలేటర్లు, 95 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు మరో 95 మంది డిపార్టుమెంట్ అధికారులు, 22 మంది కస్టోడియల్స్, 19 మంది స్పెషల్ ఆఫీసర్లు విధుల్లో పాల్గొంటారు.

144 సెక్షన్ అమలు

పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌ను అరికట్టేందుకు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను పోలీసులు విధించారు. ప్రతి కేంద్రం వద్ద సీసీ కెమెరాలు అమర్చారు. సీసీ కెమెరాలలో రికార్డు అయ్యే ప్రతి అంశాన్ని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు మానిటరింగ్ చేయనున్నారు. అవసరమైతే బాలికలను చెక్ చేసేందుకు ప్రత్యేక క్యాబిన్ ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 6 బందాలతో ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, మరికొన్ని టీమ్‌లతో సిట్టింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్దకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు.

వేసవి దృష్ట్యా ఏర్పాట్లు

ఎండలు పెరుగుతున్న దృష్ట్యా పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తాగునీరు, షామియానాలు సిద్ధం చేశారు. వైద్య బృందాలతో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర మందులను సిద్ధంగా ఉంచారు. ప్రతి కేంద్రం వద్ద ఏఎన్ఎం (నర్స్) అందుబాటులో ఉంటుంది. విద్యార్థులకు ఏ మాత్రం అస్వస్థత కలిగినా వారికి స్వస్థత చేకూర్చేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. సెల్‌ఫోన్లు, కాలిక్యులేటర్లు తీసుకెళ్లకూడదు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

విద్యార్థుల సమస్యలపై జిల్లా సెంటర్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. హాల్ టిక్కెట్ ఇవ్వకపోయినా ఇతరత్రా ఏదైనా సమస్యలు ఎదురైతే కంట్రోల్ రూమ్ 1800 425 7635 టోల్ ఫ్రీ నెంబర్‌కి ఫిర్యాదు చేయాలని అధికారులు ప్రకటించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఏదైనా ఇబ్బందులు ఉంటే 0861–2320312 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

పక్కాగా పరీక్షల నిర్వహణ

– వరప్రసాదరావు, ఆర్ఐఓ

పరీక్షలకు సంబంధించి మంగళవారం ఆర్ఐఓ వరప్రసాదరావు స్టోన్‌హౌస్‌పేటలోని తన ఛాంబర్‌లో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలను పారదర్శకంగా, పక్కాగా నిర్వహిస్తామన్నారు. ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్ష ఫీజుతో సంబంధం లేకుండా విద్యార్థులకు హాల్ టిక్కెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అంతేకాకుండా ఇంటర్ బోర్డు హాల్ టిక్కెట్లను ఆన్‌లైన్‌లో కూడా విడుదల చేసిందని వివరించారు. నేరుగా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వివరించారు.

తేలిన పోలింగ్ లెక్క....!

- ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల నుంచి కౌంటింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు
- రేపు ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ బాక్సుల స్క్రూటినీ ప్రక్రియను మంగళవారం నిర్వహించారు. చిత్తూరు జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఎస్వీ సెట్(ఆర్‌వీఎస్) కళాశాల కౌంటింగ్ కేంద్రంలో స్క్రూటినీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించారు. ప్రకాశం, బాపట్ల, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి ఉపాధ్యాయ, పట్టభద్రుల పోలింగ్ బాక్సులను బందోబస్తు నడుమ కౌంటింగ్ కేంద్రానికి తరలించారు. స్క్రూటినీ ప్రక్రియ అనంతరం ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల స్థానానికి 70.66 శాతం, ఉపాధ్యాయుల స్థానానికి 89.34 శాతం ఓట్లు (తిరుపతి జిల్లాలో రద్దయిన 229,233 పోలింగ్ కేంద్రాల ఓట్లు మినహాయించి) పోలైనట్లు అధికారికంగా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ వెల్లడించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు, అబ్జర్వర్‌లు కాటమనేని భాస్కర్, కోన శశిధర్‌ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూంలలో భద్రపరచి సీల్ చేశామని తెలిపారు.

నెల్లూరు జిల్లాలో అధికంగా ఓట్లు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో నెల్లూరు జిల్లాలో పట్టభద్రుల స్థానానికి అధికంగా ఓట్లు నమోదయ్యాయి. ఆ జిల్లాలో 82,225 మంది ఓటర్లు ఉన్నారు. 68,559 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో ఆ జిల్లాలో అత్యధికంగా 83.38 ఓటింగ్ శాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. అత్యల్పంగా ప్రకాశం జిల్లాలో ఓట్లు నమోదయ్యాయి. ఆ జిల్లాలో మొత్తం 1,07,635 మంది ఓటర్లు ఉండగా, 59,835 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ జిల్లాలో 55.59 శాతం ఓటింగ్ మాత్రం నమోదైంది.

టీచర్ స్థానానికి అధికంగా బాపట్ల జిల్లాలో

టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి అధికంగా బాపట్ల జిల్లాలో ఓట్లు నమోదయ్యాయి. ఆ జిల్లాలో 1789 మంది ఓటర్లు ఉండగా, 1686 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో ఆ జిల్లాలో అత్యధికంగా 94.24 శాతం ఓటింగ్ నమోదైంది. అత్యల్పంగా తిరుపతి జిల్లాలో 86.11 శాతం ఓటింగ్ నమోదైంది. ఆ జిల్లాలో 6132 మంది ఓటర్లు ఉండగా, 5280 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అల్లికలే ఆధారం

- పొట్ట నింపుతున్న తట్టలు
- కులవృత్తిపై ఆధారపడిన గిరిజనులు
- చేయూతనిస్తున్న ప్రభుత్వం

ఇటీవల వరకు తమకు కూడు పెట్టిన కులవృత్తులు నేడు ఆదరణ కోల్పోయి ఆ పని చేసేవారు ఇతర వృత్తులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. అయినప్పటికీ కొందరు వారి వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఈత మెల్లెలతో తట్టలు, బుట్టలను అల్లి జీవనోపాధి పొందే గిరిజనులు నేటికీ అదే వృతిపై ఆధారపడి పొట్ట నింపుకుంటున్నారు. ఈ అల్లికలే వారికి తిండి పెడుతున్నాయి. ఈ తట్టలు, బుట్టల స్థానంలో ప్లాస్టిక్ తట్టలు వచ్చినప్పటికీ ఆదరణ తగ్గకపోవడంతో వీటిని తయారు చేసే గిరిజనులు తమ వృత్తినే కొనసాగిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో నివసించే గిరిజనులు ఇప్పటికీ తమ కులవృత్తి అయిన తట్టలు, బుట్టల అల్లికలనే జీవనోపాధిగా కొనసాగిస్తున్నారు. వ్యవసాయంలో రైతులకు, మట్టి పనులు చేసే కూలీలకు అవసరమైన ఉప్పర తట్టలు, బుట్టలను ఈత మెల్లెలతో తయారు చేసి మార్కెట్‌లో విక్రయించి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సైతం వీరికి అందుతుండడంతో ఆర్థికంగా ఎదుగుతున్నారు.

రెండు వేల కుటుంబాలకు ఉపాధి

జిల్లాలో సుమారు 2 వేల గిరిజన కుటుంబాలకు పైగా ఈత మెల్లెలతో తట్టలు, బుట్టలు తయారు చేస్తున్నారు. జిల్లాలోని ఆత్మకూరు, ఉదయగిరి, వెంకటగిరి, సర్వేపల్లితోపాటు కావలి నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లోనే ఈత చెట్లు అందుబాటులో ఉండడంతో ఆయా ప్రాంతాల్లో వీరు తట్టలు, బుట్టలు తయారు చేస్తున్నారు. ఒక్క అనుమసముద్రంపేట మండలంలోని చౌటభీమవరం, గుడిపాడు గ్రామాల్లోనే సుమారు 70 గిరిజన కుటుంబాలు ఈ వృత్తిపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. రైతులకు, సామాన్య ప్రజలకు అవసరమైన ఈత తట్టలు, బుట్టలు అల్లి వాటిని విక్రయించి రోజుకు సుమారు రూ.500 సంపాదిస్తున్నారు.



గుడిపాడులో తట్ట అల్లేందుకు ఈత మెల్లెలను సిద్ధం చేస్తున్న గిరిజనుడు

ఈత ఆకులు తెచ్చి..

ఉప్పర తట్టలు, బుట్టలు అల్లకానికి ఈత మట్టలు అవసరం. వాటి ఆకులు తొలిచి మెల్లెలతో తట్టలు, బుట్టలు తయారు చేస్తారు. అయితే ఆధునికీకరణ నేపథ్యంలో తట్టలు, బుట్టల స్థానంలో ప్లాస్టిక్ వస్తువులు రావడంతో వీరి ఆదాయానికి గండిపడింది. పట్టణీకరణ నేపథ్యంలో రోడ్ల విస్తరణ, పారిశ్రామిక విప్లవం రావడంతో బీడు భూముల్లో, రోడ్లకిరువైపులా ఉన్న ఈత చెట్లను తొలగించడంతో ఇబ్బందులు తలెత్తాయి. ప్రస్తుతం అటవీ ప్రాంతాల్లోనే ఈత చెట్లు ఉండడంతో ఆ ప్రాంతాలకు సమీపంలో ఉన్న గిరిజనులు మాత్రమే ఈ తట్టలు, బుట్టలు తయారు చేయగులుగుతున్నారు. అటవీ ప్రాంతానికి వెళ్లి ఈత మెల్లెలను తీసుకువచ్చి వాటిని నానబెట్టి తట్టలు అల్లుతారు. వీటిని నెల్లూరు, కావలి, ఒంగోలు తదితర ప్రాంతాల్లో విక్రయించి డబ్బులు సంపాదిస్తున్నారు. ఇంత కష్టపడినా ఒక్కొక్క తట్టకు కేవలం రూ.50లు మార్కెట్‌లో ధర లభిస్తుందని గిరిజనులు చెబుతున్నారు. ఒక్కొక్క కుటుంబం రోజుకు 10 నుంచి 15 తట్టలను తయారు చేస్తుందని వారు తెలిపారు.



గిరిజనులు అల్లిన ఈత తట్టలు

ప్లాస్టిక్ తట్టలతో తిప్పలు

గత కొన్నేళ్ల నుంచి తట్టల రూపంలో ప్లాస్టిక్‌వి మార్కెట్‌లోకి రావడంతో వ్యాపారం బాగా దెబ్బతిని గిరిజనుల ఆదాయానికి గండిపడింది. ప్లాస్టిక్ తట్టలతో అటు రైతులు, ఇటు కూలీలకు ఇబ్బందులు వస్తుండడంతో తిరిగి ఈత మెల్లెల తట్టల పైనే ఆసక్తి చూపుతుండడంతో తిరిగి వ్యాపారం క్రమేణా పుంజుకుంది. ప్రభుత్వం కూడా ప్రతి ఇంటికి ఉపాధి పనులను కల్పించడంతో మహిళలు ఉదయాన్నే కరువు పనికి వెళ్లి, మధ్యాహ్న సమయంలో పురుషులకు తట్టల తయారీలో సహకరిస్తున్నారు.

అండగా ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు అండగా నిలుస్తోంది. ప్రభుత్వం గిరిజనులకు విద్యుత్ బిల్లులు రద్దు చేయడంతో కరెంటు బిల్లులు చెల్లించే అవసరం లేకుండా వారికి వచ్చే ఆదాయాన్ని కూడబెట్టుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. ప్రతి గిరిజన కుటుంబంలో ఒక వ్యక్తికి ప్రభుత్వం పింఛన్ సైతం మంజూరు చేయడంతో ప్రస్తుతం ఆయా కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిస్తోంది.

రోజుకు రూ.500 ఆదాయం



ఈత తట్టలు అల్లి మార్కెట్‌లో అమ్మితే రోజుకు రూ.500 ఆదాయం వస్తుంది. దీంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా జీవనం సాగిస్తున్నాం. గతంలో ప్లాస్టిక్ తట్టలు రావడంతో ఆర్థికంగా చితికిపోయాం. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకుండా సంతోషంగా ఉన్నాం.

– చలంచర్ల శీనయ్య, గిరిజనుడు, గుడిపాడు, ఏఎస్‌పేట మండలం

మాకు జీవనాధారం



తట్టలు అల్లడం ద్వారా మాకు జీవనాధారం లభించింది. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ మరింత సాయపడుతోంది. మా కుటుంబాలకు ప్రభుత్వం అన్నివిధాలుగా సంక్షేమ పథకాలు అందిస్తోంది. కరువు పనికి పోవడం వల్ల రోజుకు రూ.250 గిట్టుబాటు అవుతుంది. కరెంటు బిల్లులు కూడా ప్రభుత్వం రద్దు చేసింది.

– పొట్లూరి గురమ్మ, గుడిపాడు, ఏఎస్‌పేట మండలం

బ్యాటరీల చోరీ ముఠా అరెస్ట్

- రూ.7.40 లక్షల విలువైన బ్యాటరీల స్వాధీనం

కావలిరూరల్: జిల్లాలో సెల్‌ఫోన్ టవర్ల వద్ద బ్యాటరీలు చోరీ చేస్తున్న ముఠాను మంగళవారం అరెస్ట్ చేసినట్లు కావలి డీఎస్పీ ఎం.వెంకటరమణ తెలిపారు. పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. కావలి రూరల్, బిట్రగుంట, ఎస్ఆర్‌పురం, దగదర్తి, కోవూరు, కొడవలూరు, జలదంకి పోలీస్‌స్టేషన్ల పరిధిలో సెల్‌ఫోన్ టవర్లలో ఉన్న బ్యాటరీలను కావలి పట్టణం ఇందిరమ్మ కాలనీ, ముసునూరులకు చెందిన దార్ల తిరుపతి, దార్ల శ్రీను, దార్ల శ్రీను(మొల్లోడు), పర్తాపు కల్యాణం, దార్ల చిన్న రాత్రి వేళల్లో ఆటోలో తిరుగుతూ సెల్‌టవర్ల వద్ద తాళాలు పగులగొట్టి బ్యాటరీలు చోరీ చేసేవారు. ఎస్పీ ఆదేశాల మేరకు కావలిరూరల్ సీఐ ఎం.రాజేష్, ఎస్సై వెంకటరావు సిబ్బందితో కలిసి మంగళవారం ముసునూరు పమిడి కళాశాల వద్ద జాతీయ రహదారిపై నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిపారు. నిందితులను విచారించి వారి వద్ద నుంచి రూ.7.40 లక్షల విలువైన 100 బ్యాటరీలు, ఆటో, బైక్, టూల్‌కిట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బైక్‌ను బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం



సుబ్బారాయుడు మృతదేహం

కావలి రూరల్: ఆర్టీసీ హైర్ బస్సు ఢీకొని మనుబోలు సుబ్బారాయుడు(34) అనే వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం స్థానిక ఆర్టీసీ గ్యారేజ్ వద్ద చోటుచేసుకుంది. ఒకటో పట్టణ ఎస్సై పి.జమాల్‌వలి తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని శ్రీపొట్టిశ్రీరాములు వీధికి చెందిన మనుబోలు సుబ్బారాయుడు నెల్లూరులో ఒక ప్రైవేట్ పాఠశాలలో ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తుండేవాడు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు సోమవారం కావలికి వచ్చాడు. తన సమీప బంధువు అయిన కంటా సుభాషిణి ఆర్టీసీలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తుండడంతో ఆమెను ద్విచక్రవాహనంపై స్థానిక ఆర్టీసీ గ్యారేజ్‌లో వదిలి వస్తుండగా హైర్ బస్సు అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సుబ్బారాయుడు అక్కడికక్కడే మృతిచెందాడు. సుబ్బారాయుడుకి భార్య, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పక్కాగా పదో తరగతి పరీక్షలు

- కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు జరిగే పదో తరగతి పరీక్షలను ఎలాంటి లోపాలు లేకుండా పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు అధికారులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై మంగళవారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామ్స్ రామారావు జిల్లాలో చేపట్టిన పరీక్షల ఏర్పాట్లపై వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 29,401 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారని, వీరి కోసం 172 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, రూట్ ఆఫీసర్లు ముందుగానే అన్ని పరీక్ష కేంద్రాలను పరిశీలించి విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, కుర్చీల వంటి వసతులపై దృష్టి సారించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులను మూసివేసి 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. కేంద్రాలను తనిఖీ చేసేందుకు 10 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, 18 మంది రూట్ ఆఫీసర్లను, మరో 18 మంది అదనపు రూట్ ఆఫీసర్లను, పరీక్ష కేంద్రాల పర్యవేక్షణకు 172 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లను, 172 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లనునియమించినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

3 నుంచి ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఏప్రిల్ 3 నుంచి 17వ తేదీ వరకు ఏపీ ఓపెన్ స్కూల్ 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. 10వ తరగతికి సంబంధించి 1,207 మంది విద్యార్థులు, 3,090 మంది ఇంటర్ విద్యార్థులు, ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం వారు నిర్వహించే ఓపెన్ స్కూల్ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. వీరి కోసం 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అలాగే ఏప్రిల్ 18 నుంచి 23వ తేదీ వరకు ఓపెన్ ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు కూడా నిర్వహిస్తామన్నారు. జెడ్పీ సీఈఓ చిరంజీవి, ఆర్‌ఐఓ వరప్రసాద్, నగరపాలకసంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు
- వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ సీహెచ్ విజయారావు

నెల్లూరు(క్రైమ్): ఇంటర్మీడియట్ పరీక్షలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ సీహెచ్ విజయారావు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి మంగళవారం పోలీసు అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బుధవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని, ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని దుకాణాలు, జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి స్మార్ట్‌వాచ్, మొబైల్స్, ఐపాడ్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతిలేదని, ప్రతి విద్యార్థినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే లోపలికి అనుమతించాలని తెలిపారు. సిబ్బంది సైతం మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ పరికరాలను తమ వెంట తీసుకెళ్లేందుకు అనుమతిలేదన్నారు. స్ట్రాంగ్‌రూమ్స్ నుంచి పరీక్ష పేపర్లు కేంద్రాలకు తరలించడం, సమాధాన పత్రాలను తిరిగి స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ విజయారావు

ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకు అనుమతి

పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను ఉదయం 8.30 నుంచి 9గంటల వరకు మాత్రమే అనుమతిస్తామని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించమని ఎస్పీ తెలిపారు. విద్యార్థులు నిర్ణీత సమయం లోపు పరీక్ష కేంద్రాలకు రావాలన్నారు. చిట్టీలు, మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, నెల్లూరు నగర, రూరల్, ఆత్మకూరు, కావలి, కందుకూరు, ట్రాఫిక్ డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఫారెక్స్, ఎఫ్‌బీఐలపై ప్రశ్నించిన ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(సెంట్రల్): విదేశీ మారక ద్రవ్యం(ఫారెక్స్), ఎఫ్‌బీఐ(విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి) పొందడంలో సాయం, లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలు మెరుగు పరచడం, ఉపాధి కల్పన మొదలైన వాటిని పెంపొందించుకునేందుకు ప్రభుత్వం ఏమైనా ప్రతిపాదిస్తుందా..? అంటూ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మంగళవారం పార్లమెంటులో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అలా ప్రతిపాదనలు ఉంటే తూర్పువైపున ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతాన్ని దృష్టిలో పెట్టుకుని తీరంలో ట్రాన్స్‌షిప్‌మెంట్ హబ్‌ను ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందా..? అలా చేసేట్లయితే వాటి వివరాలను తెలపాలని కోరారు. స్పందించిన కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ ప్రస్తుతం కొచ్చిన్‌లోని ఇంటర్నేషనల్ కంటైనర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ టెర్మినల్ పనిచేస్తుందన్నారు. అంతర్జాతీయ కంటైనర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ టెర్మినల్(ఐసీటీటీ) ప్రాజెక్టు గలాథియాలోని గ్రేట్ నికోబార్ దీవుల్లో భారత ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు. ఇది ఫారెక్స్‌ను ఆదా చేయడంలో, విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడంలో, ఉపాధి కల్పనకు తోడ్పడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు తీరంలో ట్రాన్స్‌షిప్‌మెంట్ హబ్ అభివృద్ధికి ప్రతిపాదన లేదన్నారు.

పోలీసులతో దురుసు ప్రవర్తన

- టీడీపీ నేతపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): టీడీపీ తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్‌పై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా డీకేడబ్ల్యూ కళాశాలలోని పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ అభ్యర్థి శ్రీకాంత్ పచ్చ కండువా వేసుకుని లోనికి వెళుతుండగా అక్కడి పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కోపోద్రిక్తుడైన ఆయన విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించడంతోపాటు వారి విధులకు ఆటంకం కలిగించారు. ఈ మేరకు దర్గామిట్ట పోలీసులు సోమవారం అర్ధరాత్రి కేసు నమోదు చేశారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.90
సన్నవి	: రూ.80
పండ్లు	: రూ.40



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: రూ.109
లేయర్ (లైవ్)	: రూ.75
బ్రాయిలర్ చికెన్	: రూ.194
స్కిన్‌లెస్ చికెన్	: రూ.216
లేయర్ చికెన్	: రూ.128

